RNI No - APTEL/2022/81596

# జనోదయ

janodaya

కరీంనగర్ సోమవారం 02.03.2026 సంపుటి : 03 సంచిక : 86 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Monday 02.03.2026 Volume: 03 Issue 86 Pages 08 Cost 5/

తెలుగు దినపత్రిక

## నేడు వికారాబాద్‌కు రాహుల్ గాంధీ



**హైదరాబాద్, మార్చి 1 :** లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోమవారం వికారాబాద్ జిల్లాకు రానున్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి హిల్స్‌లో జరు గుతున్న ఏపీ, తెలంగాణ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్య క్షుల శిక్షణ ముగింపు కార్యక్రమా నికి హాజరు అవుతున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఉదయం 9.30 గంటలకు ఢిల్లీ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి రాహుల్ చేరుకుంటారు. అక్కడ సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతం పలుకుతారు. అక్కడి నుంచి సీఎంతో కలిసి అనంతగిరి వెళ్తారు. ఈ నెల 16న జరగనున్న రాజ్యసభ సభ్యుల ఎన్నికలకు సంబంధించి అభ్య ర్థులను ప్రకటించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

## బీఆర్ నాయుడుతో రాజీనామా చేయించాలి

### టీటీడీ చైర్మన్ పదవికి అనర్హుడు : భూమన



**అమరావతి, మార్చి 1 :** ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెంకటేశ్వరస్వామి మీద దైవభక్తి నిజమైతే అశ్లీల వీడియోతో దొరికిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును తక్షణమే రాజీనామా చేయించాలని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పవిత్రమైన టీటీడీ చైర్మన్ పదవికి అనర్హుడని అన్నారు. ఆదివారం తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో సానుకూల మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను పవనానంద స్వాములూ అని సంబోధిస్తూ.. బీఆర్‌ను ఎలా సమర్థిస్తారని సమాజం ప్రశ్నిస్తోందన్నారు. బీఆర్ నాయుడును ముఖ్యమంత్రి ఎలా క్షమిస్తారని ప్రశ్నించారు. బీఆర్ అనైతిక చర్యల గురించి వైసీపీ మొదటి నుంచి హెచ్చరిస్తోందని అన్నారు. ఏడాదిన్నరగా ఆధారాలు చూపిస్తున్నా చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. డీప్‌ఫేక్ వీడియోలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారని, బీఆర్‌ను కాపాడాలని చూస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ తప్పునకు భవిష్యత్తులో చంద్రబాబే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. దేవుడికి సేవచేసే అవకాశం వస్తే ఆలయంలో బీఆర్ నాయుడు రాజకీయాలు చేశారని ఆరోపించారు. వైఎస్ జగన్, ఆయన సతీమణిపై వేసిన నిందకు బీఆర్ నాయుడుకు దేవుడు వేసిన శిక్ష ఇది అని భూమన అన్నారు.



## ఖమేనీ మృతిపై భారత్‌లో నిరసనలు

**న్యూఢిల్లీ:** ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి పట్ల ఆదివారం భారత్‌లో తీవ్ర ఆగ్రహం, సంతాపం వ్యక్తమైంది. కశ్మీర్ మొదలుకొని కర్ణాటక వరకు పలు రాష్ట్రాల్లో షియా ముస్లింలు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. 15 లక్షల షియా ముస్లింలు ఉన్న కశ్మీర్‌లోని శ్రీనగర్, బుద్గాం, బందిపోరా, అనంత్‌నాగ్, పుల్వామాలో షియాలు గుండెల మీద బాదుకొంటూ వీధుల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. జమ్ము కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఇరాన్‌లోని తాజా పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనకారులు శాంతియుతంగా ఆందోళన చేయాలని కోరారు. యూపీలోని లక్నో, అజ్మీర్‌లోనూ నిరసనలు చోటు చేసుకున్నాయి. కర్ణాటకలో 1986లో ఖమేనీ సందర్శించిన ఓ గ్రామంలో స్వచ్ఛందంగా దుకాణదారులు షాపులను మూసివేశారు. మూడు రోజులు సంతాప దినాలుగా పాటించాలని గ్రామస్థులు నిర్ణయించారు. న్యూఢిల్లీ, బీహార్, జార్ఖండ్, తెలంగాణలో తీవ్ర ఆందోళనలు, నినాదాల దృశ్యాలు కనిపించాయి.

## దద్దరిల్లిన గల్ఫ్ దేశాలు

### సుప్రీం లీడర్ ఖమేనీ మృతికి ప్రతీకారంగా ఇరాన్ భీకర దాడులు

### ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ఎటాక్..సైప్రస్‌లోని బ్రిటన్ స్థావరాలపైనా దాడి



**టెహ్రాన్:** ఖమేనీ మృతి తర్వాత ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలపై క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. ఇరాన్ దాడుల్లో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం, ప్రసిద్ధ బుర్జ్ అల్ అరబ్, పామ్ జుమైరా హోటళ్లు దెబ్బతిన్నాయి. ఆదివారం పేలుళ్లతో ఎమిరేట్స్ దద్దరిల్లింది. బహ్రెయిన్‌లోని మనామా నగరంలో క్రౌన్ ప్లాజా హోటల్‌ను ఒక సూసైడ్ డ్రోన్ ధ్వంసం చేసింది. అలాగే ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌పై దాడిలో కొంతమంది పౌరులు మరణించినట్టు సమాచారం. దుబాయ్‌లో పలుచోట్లు పేలుళ్లు సంభవించినట్టు వార్తా కథనాలు వెలువడ్డాయి. పెద్ద పేలుడు శబ్దాలు తమకు కూడా వినిపించినట్టు సౌదీ అరేబియా రాజధాని రియాద్ ప్రజలు తెలిపారు. ఇక ఖతర్ రాజధాని దోహా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇజ్రాయెల్, బహ్రెయిన్, కువైట్, ఇరాక్‌లతోపాటు తొలిసారిగా ఒమన్‌పై కూడా డ్రోన్, క్షిపణులతో ఇరాన్ దాడులు చేసింది. ఒక్క మాటలో చెప్పాలంటే అమెరికా ఆస్తులు, స్థావరాలు కలిగి ఉన్న అరబ్ దేశాలన్నింటినీ ఇరాన్ లక్ష్యంగా చేసుకుంది. అలాగే సైప్రస్‌లో ఉన్న బ్రిటిష్ మిలిటరీ స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ రెండు క్షిపణులతో దాడులు చేసింది.

**అమెరికా యుద్ధనౌకపై దాడి!**

ఖమేనీ హత్యకు ప్రతీకారంగా యూఎస్ఎస్ అబ్రహం లింకన్ యుద్ధనౌకపై దాడి చేసినట్టు ఇరాన్ ప్రకటించింది. 4 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్టు తెలిపింది. అయితే దీన్ని అమెరికా తోసిపుచ్చింది. గల్ఫ్ నదీ జలాల్లో మోహరించి ఉన్న ఈ నౌకకు సమీపంగా కూడా క్షిపణులు రాలేదని పేర్కొన్నది.

## భళా శాంసన్



- టీ20 ప్రపంచకప్‌లో సెమీస్‌కు భారత్
- నాకౌట్‌లో విండీస్‌పై ఘన విజయం
- శాంసన్ చిరస్మరణీయ ఇన్నింగ్స్
- ముగిసిన సూపర్-8 దశ

4లో..

**భారత క్రికెట్ అభిమానుల ఉత్కంఠకు తెర! టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ చేరాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా బ్యాట్‌తో అదరగొట్టింది. బంతితో అంచనాలను అందుకోలేకపోయినా బ్యాట్‌తో మాత్రం సత్తాచాటింది. భారత క్రికెట్ మక్కాగా పిలుచుకునే ఈడెన్ గార్డెన్స్‌లో వర్చువల్ నాకౌట్‌గా సాగిన పోరులో వెస్టిండీస్‌ను 5 వికెట్ల తేడాతో చిత్తుచేసి సెమీస్‌కు అర్హత సాధించింది.**

## కూలగొట్టుడు.. కొల్లగొట్టుడే

### రేవంత్ సర్కార్‌ది లూటిఫికేషన్

- శాడిస్టిక్ ప్లెజర్‌తోనే మూసీలో రేవంత్ విధ్వంసం: కేటీఆర్
- ప్రజలకు నీడ లేకుండా చేస్తున్న ముఖ్యమంత్రి
- బఫర్‌జోన్ పేరిట ఇండ్లు కూల్చి రియల్ దందా
- బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఇంటినీ కూల్చలే
- 16 వేల కోట్లతో మూసీ మాడల్ చూపిన కేసీఆర్
- రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దోచిపెట్టేందుకే మూసీ పేరిట
- కాంగ్రెస్ లక్షన్నర కోట్లు మింగే ప్లాన్
- అభివృద్ధికి కాదు, కమీషన్ల దందాకు మేం వ్యతిరేకం
- ధ్వజమెత్తిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పరీవాహక ప్రజలకు అండగా ఉంటామని హామీ
- నిర్వాసితులకు మద్దతుగా 'మూసీ దండి మార్చ్'

4లో..



**తనకు శాడిస్టిక్ ప్లెజర్ ఉన్నదని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డే ఒప్పుకొన్నాడని, ఆ శాడిస్టిక్ ప్లెజర్‌తోనే రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కష్టపడి కొనుక్కున్న భూములు కొల్లగొట్టి, లోన్లు తెచ్చుకొని కట్టుకున్న ఇండ్లను కూల్చేసి, ప్రజలకు నిలువ నీడ లేకుండా చేయడమే రేవంత్‌రెడ్డికి ఉన్న శాడిస్టిక్ ప్లెజర్ అని నిప్పులు చెరిగారు.**

# ప్లాస్టిక్‌ను ఏరి వేద్దాం - ప్రకృతిని కాపాడుదాం

**-నగరంలోని ఓ సిటీలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు ముందడుగు**



**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ) :** గ్రేటర్ వరంగల్ నగరం లోని ఓసిటీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6:30 గంటలకు ప్లాస్టిక్ ఏరివేద్దాం – ప్రకృతిని కాపాడుదాం అనే నినాదంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓ సిటీ కమిటీ సభ్యులు మరియు కాలనీ వాసుల ఆధ్వర్యంలో కాలనీలో పేరుకు పోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను వీధి వీధికి తిరుగుతూ.. సుమారు 20 గోనె సంచులలో వ్యర్థాలను సేకరించి మునిసిపాలిటీ వ్యాన్ లో వేయడం జరిగింది. అలాగే అవగాహన ర్యాలీ కూడా నిర్వహించారు. "ప్లాస్టిక్ ను వదిలేద్దాం – ప్రకృతిని కాపాడుదాం" "శుభ్రమైన కాలనీగా మార్చుకుందాం – ఆరోగ్యంగా జీవించుదాం" వంటి నినాదాలతో మరియు పాటలతో ప్రజలలో చైతన్యం కల్పించారు. కాలనీని గ్రీన్ అండ్ గ్రీన్ గా ఉంచేందుకు ప్రతి ఒక్కరం బాధ్యత తీసుకుంటామని, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ వస్తువులను వాడుతామని అన్నారు. అలాగే ఈ విధమైన కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులైన అధ్యక్షుడు జోగు చంద్రశేఖర్, జనరల్ సెక్రెటరీ బొబ్బల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి బజ్జూరి వేణుగోపాల్, కాలనీవాసులు, ప్రముఖులు, మహిళలు, మరియు పిల్లలు పాల్గొన్నారు.

# మల్లూరు దేవాలయాన్ని అభివృద్ధి చేస్తాం

**టెంపుల్ టూరిజం ప్రాంతంగా గోదావరి పరివాహక ప్రాంతం**
**మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**



**జనోదయ, మంగపేట, మార్చి 1:** మల్లూరు దేవాలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తాం అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.ఆదివారం మంగపేట మండలం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లతో కలిసి ఆలయాన్ని సందర్శించారు.స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ములుగు ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన పర్యాటక కేంద్రాలు నెలవై ఉన్నాయని, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజా ప్రభుత్వం ఆలోచనలకు అనుగుణంగా మేడారం జాతరను అద్భుతంగా 200 సంవత్సరాల వరకు చెక్కుచెదరకుండా ఉండే విధంగా అభివృద్ధి చేసుకొని, మహా జాతరను గత నెల చివరిలో విజయవంతం చేసుకోవడం జరిగిందని పేర్కొన్నారు.సీఎం ఆలోచనలకు అనుగుణంగా గోదావరి పరివాహక ప్రాంతాల్లోని దేవాలయాలను బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని వాటికి సంబంధించిన పనులు కూడా త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఎస్ పి సుధీర్ రామనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఈ ఓ మహేష్, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మెన్ సురేష్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీ శక్తి -2026 అవార్డ్ అందుకున్న సాగంటి మంజుల



**వరంగల్ జిల్లా ప్రతినిధి: (జనోదయ)** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశ్వ సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో విద్యా కళాశాల అధ్యాపకురాలు, కవయిత్రి, గాయని, సామాజిక వేత్త, ప్రముఖ చిత్రకారిణి, సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ సాగంటి మంజుల కు స్త్రీ శక్తి – 2026 విమెన్ పవర్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్ ను అందించారు. ఆదివారం ఆంధ్ర ప్రదేశ్ ప్రముఖ నగరం విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో జరిగిన మహిళ దినోత్సవ సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షురాలు రమావతి మాట్లాడుతూ.. అధ్యాపకురాలిగా నూతన తరానికి ఉపాధ్యాయులను తయారు చేస్తూ.. చిన్నారుల నుండి పెద్దవారి వరకు అందరికీ అందుబాటులో ఉండి, అవసరం ఉన్నవారికి చేతనైన సాయం చేస్తూ.. చిత్ర కళా రంగం లో వినూత్న ఒరవడులు సృష్టిస్తూ.. స్త్రీలను, స్త్రీ శక్తిని తన కవితాంశంగా ఎంచుకుని అమ్మ భాషలో కవితలు రాస్తూ.. తెలుగు భాషకు సేవ చేస్తూ.. ఎందరో చిన్నారులను చిత్ర కళా శిక్షణ అందిస్తున్న మంజులకు ఈ అవార్డ్ ఇవ్వడం ఆనందంగా ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు మాస్ట్రో డా గజల్ శ్రీనివాస్, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాల కృష్ణ, ఆంధ్ర ప్రదేశ్ సృజనాత్మకత సాంస్కృతిక కమిషన్ చైర్మన్ పాడపాటి తేజస్వి పాల్గొన్నారు.

# క్రీడల్లో ప్రతిభ కనబరిచిన మోడల్ స్కూల్ విద్యార్థులు



**జనోదయ, మందమర్రి మార్చి 1:** పట్టణంలోని కార్మెల్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఖోఖో పోటీల్లో పట్టణ లోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొని ద్వితీయ బహుమతి సాధించారని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సారా తస్నీమ్ తెలిపారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాబోధన కాకుండా క్రీడల్లో తగిన శిక్షణ అందిస్తూ జిల్లా రాష్ట్రస్థాయి క్రీడాకారులుగా తీర్చి దిద్దుతు విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించడం జరుగు తుందన్నారు. ఆదర్శ పాఠశాల విద్యార్థులు చదువు లోనే కాకుండా క్రీడల్లో రాణిస్తున్నారన్నారు.

# బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులుగా గాదె రాములు



**జనోదయ, మందమర్రి మార్చి 1:** భారతీయ జనతా పార్టీ పట్టణ ఉపాధ్యక్షులుగా గాదె రాములు ను నియమించారు. ఈ మేరకు పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్, సీనియర్ నాయకులు డివి దీక్షితులు ఆదివారం నియామక పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా గాదె రాములు మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తూనే పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. అలాగే తనకు ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన సీనియర్ నాయకులు దీక్షితులు, పట్టణ అధ్యక్షులు నరేష్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# మంత్రి, ఎంపీల చిత్ర పటాలకు పాలాభిషేకం



**జనోదయ, మందమర్రి ,మార్చి 1:** పట్టణంలోని మందమర్రి(వి) చెరువు కట్టపై మినీ ట్యాంక్ బండ్ ఏర్పాటుకు కోటి రూపాయలు నిధులు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణల చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఆదివారం చెరువు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ నాయకులు, వాకర్స్ అసోసియేషన్ నాయకులు బండి సదానందం ఆధ్వర్యంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**మంజూరు చేసిన ఇండ్లను వెంటనే పూర్తి చేసుకోవాలి**

**మంత్రి దనసరి అనసూయ సీతక్క**

**జనోదయ, ఏటూరు నాగారం**

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తూ ప్రజా ప్రభుత్వం పేదవారి కలలను సాకారం చేస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం ఏటూరు నాగారం మండలం కేంద్రంలోని ఎస్ ఎల్ ఎన్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి ఏటూరు నాగారం మండలం కొండాయి గ్రామానికి చెందిన 90 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను, ఏటూరు నాగారం మం డలానికి చెందిన 38 మంది లబ్ధి దారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... మంజూరు చేసిన ఇండ్లను లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణం పనులు పూర్తి చేసుకోవాలని తెలిపారు. కొండాయి గ్రామంలో పార్టీలకు అతీతంగా 90 మందికి ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని, 16 కోట్ల రూపాయల నిధులతో పటిష్టంగా అత్యంత నాణ్యత ప్రమాణాలతో వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మహిళా సంఘంలో సభ్యురాలుగా ఉంటే ఇంటి నిర్మాణానికి తక్షణమే లక్ష రూపాయల రుణాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. కొండాయి గ్రామం జంపన్న వాగు పరివాహక ప్రాంతంలో ఉన్నందున మంజూరు అయిన ఇండ్లను సురక్షిత ప్రాంతంలో నిర్మించుకోవాలని లబ్ధిదారులకు మంత్రి సూచించారు. ప్రభుత్వం ములుగు ప్రాంతాన్ని గతంలో ఎన్నడూ లేనటువంటి విధంగా సంక్షేమ పథకాలకు అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఈ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.



**బాల్య వివాహాలు చేసుకుంటే కఠిన చర్యలు**

బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని, ఎవరైనా బాల్యవివాహాలు చేయడానికి, చేసుకోవడానికి సిద్ధపడితే జైలు శిక్షతో పాటు కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, గ్రంథాల య సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి,డి పి ఓ వెంకయ్య, హౌసింగ్ పీడీ ఎస్.సూర్యనారాయణ, ఎంపీడీవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గోపాలపురం ఊర చెరువు పరిరక్షణకు

# రూ.4 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణం

**వివేక్ నగర్ కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తా**

**వివేక్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు**

**జనోదయ, హనుమకొండ**

మొంథా తుఫాన్ ప్రభావంతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ గోపాలపురం ఊర చెరువు కట్ట తెగిపోవడంతో వివేక్ నగర్ కాలనీ ముంపునకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో గృహోపకరణాలు దెబ్బతినగా, కాలనీ శాశ్వత పరిష్కారం దిశగా రిటైనింగ్ వాల్ కోసం 4 కోట్ల రూపాయలతో నిధులు మంజూరు చేసినందుకు గాను కాలనీవాసులు సన్మాన సభ ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు తొలుత కాలనీవాసులు తమ అభిమాన నాయకుడి పూల వర్షం కురిపిస్తూ డప్పు సప్పుల నడుమ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాలనీలోని శారదాంబ దేవి ఆలయంలో ప్రవేశించి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం పలు కాలనీలా అధ్యక్షులు కమిటీ సభ్యులు నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే నాగరాజుని ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ: గోపాలపురం ఊర చెరువు పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేయించాం అని తెలిపారు. భవిష్యత్తులో ముంపు సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనులుకొనసాగుతున్నాయని తెలిపారు. తుఫాన్ ప్రభావం, వరదల కారణంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో భారీ నష్టం వాటిల్లిందని,ఆ అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సీఎం స్వయంగా హనుమకొండకు వచ్చి పలు కాలనీలలో పర్యటించి వరద బాధితులకు ధైర్యం నింపారని తెలిపారు. ఓరుగల్లు సమగ్ర అభివృద్ధికి సీఎం ప్రత్యేక ఫోకస్ పెట్టారని, నగరానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 1/3 నిధులు కేటాయించాలని కోరామని తెలిపారు. వివేక్ నగర్ కాలనీ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకారం అందిస్తానని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అధిక నిధులు తీసుకువచ్చామని చెప్పారు. పోలీస్ శాఖలో పనిచేసిన అనుభవంతో ప్రజాసేవ తన ధ్యేయమని, పేద ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రియల్ ఎస్టేట్, కబ్జాలకు తాను దూరమని, అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షుడు కొంక హరిబాబు, వివేక్ కాలనీ అధ్యక్షుడు మర్రి ప్రభాకర్, మహిళా అధ్యక్షురాలు అనిత, కాంగ్రెస్ నాయకులు కందుకూరి పూర్ణచదర్, వివిధ కాలనీల అధ్యక్షులు, డివిజన్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ అతిథి గృహాన్ని ప్రారంభించిన డీజీపీ

**జనోదయ, హనుమకొండ, మార్చి 01:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మరమ్మతులు చేసి అభివృద్ధి చేసిన పోలీస్ అతిథి గృహాన్ని తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) బి. శివధర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆదివారం హన్మకొండ పోలీస్ గెస్ట్ హౌస్ కు చేరుకున్న డిజిపి వరంగల్ పోలీస్ కమిషనర్‌తో పాటు ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన డిజిపి అనంతరం పునరుద్ధరించిన ఆధునిక సదుపాయాలతో రూపొందించిన పోలీస్ అతిథి గృహాన్ని ప్రారంభించారు. పోలీస్ శాఖ అధికారుల, అతిథుల వసతి సౌకర్యాలను మెరుగుపరచే దిశగా ఈ అతిథి గృహం పునర్నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆధునిక సదుపాయాలతో, సౌకర్యవంతమైన వాతావరణంలో రూపొందించిన ఈ అతిథి గృహం భవిష్యత్‌లో శాఖకు మరింత ఉపయోగకరంగా ఉండనుందని డిజిపి తెలిపారు. ఈ కార్యక్రమంలో



కమిషనరేట్‌కు చెందిన డీసీపీలు అంకిత్ కుమార్, కవిత, శుభం నాగ్, అదనపు డీసీపీ లు రవి, శ్రీనివాస్, సురేష్ కుమార్, తో పాటు ఏసీపీలు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# భళా శాంసన్



- టీ20 ప్రపంచకప్‌లో సెమీస్‌కు భారత్
- నాకౌట్‌లో విండీస్‌పై ఘన విజయం
- శాంసన్ చిరస్మరణీయ ఇన్నింగ్స్
- ముగిసిన సూపర్-8 దశ

**భారత క్రికెట్ అభిమానుల ఉత్కంఠకు తెర! టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ చేరాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా బ్యాట్‌తో అదరగొట్టింది. బంతితో అంచనాలను అందుకోలేకపోయినా బ్యాట్‌తో మాత్రం సత్తాచాటింది. భారత క్రికెట్ మక్కాగా పిలుచుకునే ఈడెన్ గార్డెన్స్‌లో వర్చువల్ నాకౌట్‌గా సాగిన పోరులో వెస్టిండీస్‌ను 5 వికెట్ల తేడాతో చిత్తుచేసి సెమీస్‌కు అర్హత సాధించింది.**

**కోల్‌కతా :** భారత క్రికెట్ అభిమానుల ఉత్కంఠకు తెర! టీ20 ప్రపంచకప్‌లో సెమీస్ చేరాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా బ్యాట్‌తో అదరగొట్టింది. బంతితో అంచనాలను అందుకోలేకపోయినా బ్యాట్‌తో మాత్రం సత్తాచాటింది. భారత క్రికెట్ మక్కాగా పిలుచుకునే ఈడెన్ గార్డెన్స్‌లో వర్చువల్ నాకౌట్‌గా సాగిన పోరులో వెస్టిండీస్‌ను 5 వికెట్ల తేడాతో చిత్తుచేసి సెమీస్‌కు అర్హత సాధించింది. విండీస్ నిర్దేశించిన 196 పరుగుల భారీ ఛేదనలో వికెట్‌కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ (50 బంతుల్లో 97 నాటౌట్, 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) తన కెరీర్‌లోనే అత్యంత విలువైన ఇన్నింగ్స్ ఆడి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అతడి మెరుపులతో ఛేదనను సూర్య సేన..19.2 ఓవర్లలో 5 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. శాంసన్‌కే 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. అంతకుముందు భారత ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ సమష్టిగా ఆడి 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 రన్స్ చేసింది. రోస్టన్ ఛేజ్ (25 బంతుల్లో 40, 5 ఫోర్లు, 1 సిక్స్), జేసన్ హోల్డర్ (22 బంతుల్లో 37 నాటౌట్, 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), రోవ్‌మన్ పావెల్ (19 బంతుల్లో 34 నాటౌట్, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), షై హోప్ (32) రాణించారు. ఈ ఓటమితో విండీస్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.




### భళా శాంసన్

ఛేదనలో అభిషేక్ (10) మరోసారి స్పిన్ ఉచ్చులో చిక్కుకుని నిరాశపరచగా హోల్డర్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన ఇషాన్ కిషన్ (10) సైతం అతడినే అనుసరించాడు. ఈ క్రమంలో సంజూ, కెప్టెన్ సూర్య (18) జట్టును ఆదుకున్నారు. అకీల్ రెండో ఓవర్లో ఫోర్, రెండు సిక్స్‌లతో పరుగుల వేట ఆరంభించిన శాంసన్.. తన కెరీర్ ఊగిసలాటల నడుమ మరో చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. అనవసర షాట్లు ఆడి వికెట్ సమర్పించుకునే అలవాటున్న అతడు.. ఈ మ్యాచ్‌లో అలాంటి తప్పిదాలకు చోటివ్వకుండా ఇన్నింగ్స్ ఆసాంతరం బాధ్యతతో ఆడాడు. షెఫర్డ్ ఓవర్లో లాంగాన్ మీదుగా 6, 4 బాదిన అతడు.. బౌండరీతో 26 బంతుల్లోనే తన తొలి టీ20 వరల్డ్ కప్ అర్ధ శతకం నమోదు చేశాడు. 11వ ఓవర్లో బంతినందుకున్న జోసెఫ్.. సూర్యను ఔట్ చేసి 58 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. 10-12 ఓవర్ల మధ్య స్కోరు వేగం నెమ్మదించడంతో పాటు ఛేదించాల్సిన రన్‌రేట్ పెరుగుతుం డటంతో సంజూ, సూర్య స్థానంలో వచ్చిన తిలక్ గేర్ మార్చారు. జోసెఫ్ ఓవర్లో తిలక్ హ్యాట్రిక్ ఫోర్లు బాదాడు. ధాటిగా ఆడే క్రమంలో తిలక్.. డ్రింక్స్ విరామం తర్వాత హెట్‌మెయర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అయితే అప్పటికే క్రీజులో పాతుకుపోయిన సంజూ.. హార్దిక్ పాండ్య (17), శివమ్ దూబె (8లి) అండతో జట్టును విజయతీరాలకు చేర్చాడు.

### నిలకడ.. మెరుపులు

ఆరంభంలో ఆచితూచి ఆడిన విండీస్ బ్యాటర్లు క్రీజులో కుదురుకున్నాక మెరుపులు మెరిపించి.. ఆఖర్లో తమ మార్కు విధ్వంసంతో ఫినిషింగ్ టచ్ ఇచ్చారు. స్టార్ పేసర్ బుమ్రా మినహా నాసిరకంగా కనిపించిన భారత బౌలింగ్, ఫీల్డింగ్ తప్పిదాలను ఆసరాగా చేసుకుని పక్కా ప్రణాళికతో భారీ స్కోరు సాధించారు. ఓపెనర్‌గా ప్రమోట్ అయిన రోస్టన్ ఛేజ్.. కెప్టెన్ షై హోప్‌తో కలిసి పవర్ ప్లేలో భారత బౌలింగ్ దళాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. భారీ మెరుపులేమీ లేకపోయినా పవర్ ప్లేలో వికెట్లేమీ కోల్పోకుండా 45 రన్స్ చేసిన విండీస్.. 9వ ఓవర్లో తొలి వికెట్‌ను కోల్పోయింది. హోప్‌ను వరుణ్ బౌల్డ్ చేశాడు. బుమ్రా 12వ ఓవర్లో ప్రమా దకర హెట్‌మెయర్ (27)తో పాటు ఛేజ్‌నూ ఔట్ చేశాడు. హార్దిక్ ఓవర్లో రూథర్‌ఫర్డ్ (14) కూడా నిష్క్రమించాడు. అతడు ఔటయ్యే సమయానికి విండీస్ స్కోరు 14.1 ఓవర్లకు 119/4గానే ఉం ది. కానీ ఆఖరి ఐదు ఓవర్లలో కరీబి యన్లు ఏకంగా 70 రన్స్ పిండుకున్నారు. హోల్డర్, పావెల్ అభేద్యమైన ఐదో వికెట్‌కు 35 బంతుల్లోనే 76 పరుగులు జోడించి భారత్ ఎదుట భారీ లక్ష్యాన్ని నిలిపారు.

### సెమీస్‌లో ఇలా..

భారత్, వెస్టిండీస్ మ్యాచ్‌తో ప్రపంచ కప్‌లో సూపర్-8 దశకు శుభం కార్డు పడింది. గ్రూప్-1 నుంచి దక్షిణాఫ్రికా, భారత్.. గ్రూప్-2 నుంచి ఇంగ్లండ్, న్యూజిలాండ్ సెమీస్ చేరాయి. గ్రూప్-2 నుంచి పాక్ నిష్క్రమించడంతో రెండు సెమీస్ మ్యాచ్‌లతో పాటు ఫైనల్ కూడా భారత్‌లోనే జరుగనుంది. మార్చి 4న సౌతాఫ్రికా.. కోల్‌కతా వేదికగా న్యూజిలాండ్‌తో తలపడనుండగా ఆ మరుసటి రోజున ఇంగ్లండ్.. ముంబైలో టీమ్ ఇండియాతో అమీతుమీ తేల్చుకోనుంది. సెమీస్‌లో గెలిచిన జట్లు ఈనెల 8న అహ్మదాబాద్‌లో టైటిల్ పోరులో తలపడతాయి.

# కూలగొట్టుడు..కొల్లగొట్టుడే

**శాడిస్టిక్ ప్లెజర్‌తోనే మూసీలో రేవంత్ విధ్వంసం: కేటీఆర్**

**ప్రజలకు నీడ లేకుండా చేస్తున్న ముఖ్యమంత్రి**

**బఫర్‌జోన్ పేరిట ఇండ్లు కూల్చి రియల్ దందా**

**బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఇంటినీ కూల్చలే**

**16 వేల కోట్లతో మూసీ మాడల్ చూపిన కేసీఆర్**

**రియల్ ఎస్టేట్ వ్యాపారులకు దోచిపెట్టేందుకే మూసీ పేరిట**

**కాంగ్రెస్ లక్షన్నర కోట్లు మింగే ప్లాన్**

**అభివృద్ధికి కాదు, కమీషన్ల దందాకు మేం వ్యతిరేకం**

**ధ్వజమెత్తిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**పరీవాహక ప్రజలకు అండగా ఉంటామని హామీ**

**నిర్వాసితులకు మద్దతుగా 'మూసీ దండి మార్చ్'**

హైదరాబాద్ , మార్చి 1 : తనకు శాడిస్టిక్ ప్లెజర్ ఉన్నదని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డే ఒప్పు కొన్నాడని, ఆ శాడిస్టిక్ ప్లెజర్‌తోనే రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కష్టపడి కొనుక్కున్న భూములు కొల్లగొట్టి, లోన్లు తెచ్చుకొని కట్టుకున్న ఇండ్లను కూల్చేసి, ప్రజలకు నిలువ నీడ లేకుండా చేయడమే రేవంత్‌రెడ్డికి ఉన్న శాడిస్టిక్ ప్లెజర్ అని నిప్పులు చెరిగారు.'శాడిస్టిక్ ప్లెజర్ ఉన్న రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఇండ్లు కూలగొట్టడమే పనిగా పెట్టుకున్నడు. అధికారంలోకి రాగానే హైడ్రా పేరుతో వందల మంది ఇండ్లు కూలగొట్టి పేదలను రోడ్డున పడేసింDు. రామగుం డం, మహబూబ్‌నగర్, ఖమ్మం వంటి ప్రాంతాల్లో ఇండ్లు కూల్చి వేలాది మంది బతుకులను ఆగం చేసిండు' అంటూ తూర్పారబట్టారు. మూసీ బఫర్ జోన్ పేరిట హైదర్‌షా కో ట్, గంధంగూడలోని పలు కాలనీల్లో ఇండ్లను ఖాళీ చేయాలని ప్రభుత్వం నోటఫికేషన్ ఇచ్చి న నేపథ్యంలో ఆదివారం నిర్వహించిన మూడున్నర కిలోమీటర్ల 'మూసీ దండి మార్చ్' పాదయాత్రలో కేటీఆర్ పాల్గొన్నారు.మూసీ ప్రాజెక్టులో భాగంగా ఇండ్లు, భూములు, అ పార్ట్ మెంట్లు కోల్పోతున్న బాధితులను కలిసి సంఘీభావం తెలిపారు. సంబంధిత కాలనీల ప్రజలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో కేటీఆర్ మాట్లాడుతూ రూ.లక్షన్నర కోట్లతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది మూసీ బ్యూటిఫికేషన్ కాదని, లూటిఫికేషన్ అని మండిపడ్డారు. అభివృద్ధికి బీఆర్ఎస్ ఎప్పటికీ అడ్డుకాదని, అభివృద్ధి పేరిట ప్రజల ఇండ్లను కూలుస్తా మంటే ఎట్టిపరిస్థితుల్లో ఊరుకోబోమని తేల్చిచె ప్పారు. 'ప్రజల ఇండ్ల జోలికి వస్తే బుల్డోజర్లకు అడ్డంగా పడుకొనైనా కాపాడుకుంటాం.. గోడలను కాదు.. సున్నం కూడా ముట్టుకోనివ్వం' అని స్పష్టంచేశారు. రేవంత్‌రెడ్డికి తెలిసిన పాలన కేవలం ఇండ్లు కూలగొట్టడం, భూములు కొల్లగొట్టడం.. రియల్ ఎస్టేట్ దందా చేయడం. ఈ వ్యాపారంలో వచ్చే కమీషన్ల కోసం పేదల జీవితాలను పూర్తిగా నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నడు. ఇండ్లు కోల్పోతున్న బాధితులంతా చిన్నాపెద్దా తేడా లేకుండా ఎన్ని రకాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా, వేడుకున్నా, చివరికి పసిపాపలపై కనికరం చూపాలని కోరినా కరశంగా ఖాళీ చేయిస్తున్నది. ఇండ్లు కూలగొట్టడం, భూములు ఆక్రమించడం, రియల్ ఎస్టేట్ దందా చేయడమే రేవంత్‌రెడ్డికి తెలిసిన పాలన అని కేటీఆర్ మండిపడ్డారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో వచ్చే కమీషన్ల కోసం పేదల జీవితాలను పూర్తిగా నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పసిపిల్లలు ఉన్నారన్న కనికరం కూడా లేకుండా బెదిరింపులకు గురి చేస్తూ ఇండ్లు ఖాళీ చేయిస్తున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజల ఇండ్లు కూలగొట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడమే రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నాడని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక ప్రాజెక్టో, ఇల్లో కట్టింది లేదని, కనీసం ఒక్క రోడ్డు కూడా వేయలేదని, కేవలం విధ్వంసమే తన విధానంగా ముందుకు పోతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇండ్లు, భూములు కాపాడుకొనే పోరాటంలో బీఆర్ఎస్ మీకు అండగా ఉంటది' అని బాధితులకు భరోసా ఇచ్చారు.'కేసీఆర్ కట్టించిన అద్భుతమైన ప్రగతి భవన్ ఉన్నా ముఖ్యమంత్రి తన కోసం రూ.200 కోట్లతో ఇల్లు కట్టుకుంటున్నడు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోసం ప్రగతి భవన్‌ను కేటాయించినా హైదరాబాద్‌లో ఒక ఇల్లు, ఖమ్మం జిల్లాలో మరో ఇల్లు క్యాంపు కార్యాలయం కోసం కట్టుకుంటున్నడు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో ముఖ్యమంత్రి రెండ్లు, ఉప ముఖ్యమంత్రికి మూడు ఇండ్లు కట్టుకోవచ్చు. పైసాపైసా కూడబెట్టుకొని, బ్యాంకుల్లో లోన్లు తెచ్చుకొని సొంతింటి కల నెరవేర్చుకున్న పేద, మధ్యతరగతి ప్రజలకు మాత్రం ఒక్క ఇల్లు ఉండొద్దా?' అని కేటీఆర్ నిలదీశారు. 'రేవంత్‌రెడ్డికి, ఆయన అన్నదమ్ములకు మాత్రం రూ.వందల కోట్ల ఇండ్లు కావాలి కానీ పేదలు, మధ్యతరగతి వారికి ఒక అపార్ట్‌మెంట్ ఉండకుండా విధ్వంసం సృష్టిస్తున్నడు' అంటూ నిప్పులు చెరిగారు.'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు కొడంగల్‌లోని రెడ్డికుంట ఎఫ్‌టీఎల్‌లోనే ఉన్నది. అన్ని అనుమతులున్న ప్రజల ఇండ్లను కాదు.. ముందుగా ముఖ్యమంత్రి ఇంటిని కూల్చాలి. హైదరాబాద్‌లోని దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు ఉన్నది. ఆయన ఇంటిని ఎందుకు కూల్చడం లేదు? మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి ఇండ్లు హైదరాబాద్‌కు మంచినీళ్లు ఇచ్చే జంట జలాశయాల ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయి. వారి ఇండ్లను ముందుగా కూల్చాలి. అవన్నీ చేయకుండా పేద, మధ్యతరగతి ప్రజల ఇండ్లను అకారణంగా కూలుస్తూ విధ్వంసానికి పాల్పడుతున్నరు' అంటూ కేటీఆర్ ధ్వజమెత్తారు. పదేండ్ల బీఆర్ఎస్ హయాంలో ఒక్క ఇల్లు కూల్చకుండా, ఒక్క ఇటుక కదుపకుండా కేసీఆర్ మూసీ సుందరీకరణ చేసి చూపించారని కేటీఆర్ తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో కేవలం రూ.16 వేల కోట్లతోనే మూసీ సుందరీకరణ చేయవచ్చని డీపీఆర్ తయారు చేసి మరీ చూపారని గుర్తు చేశారు. నాగోల్ ప్రాంతంలో మూసీని సుందరీకరించి మాడల్‌గా చూపించామని చెప్పారు. కేవలం సుందరీకరణ మాత్రమే కాకుండా రోడ్లతో పాటు ఫ్లై ఓవర్లను కూడా ప్రణాళికలో పెట్టామని తెలిపారు. మూసీ పొడవునా ఓఆర్ఆర్‌కు చేరుకునేందుకు అత్యంత పొడవైన ఫ్లై ఓవర్ నిర్మాణానికి రూ.10 వేల కోట్లతో ప్రణాళికలు రూపొందించామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం, తన అనుచరులు, అన్నదమ్ములు, కుటుంబ సభ్యులకు కాంట్రాక్టులు ఇవ్వడం కోసం మూసీ పేరుతో భారీ స్కామ్‌కు తెరలేపారని విమర్శించారు. ఇందుకు పేదల ఇండ్లను పణంగా పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రూ.లక్షన్నర కోట్ల దోపిడీ కోసం వేల మంది పేదల ఇండ్లను ధ్వంసం చేస్తూ రేవంత్ రెడ్డి కొత్త స్కామ్‌కు తెరలేపాడని విమర్శించారు. 'మూసీ బఫర్‌జోన్‌కు సంబంధించి రకరకాల మాటలు చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఆరోజు అధికారంలో ఉన్నప్పుడు ఇవే అపార్ట్‌మెంట్లకు పర్మిషన్ ఇచ్చింది' అని గుర్తుచేశారు. 'నాడు అనుమతులు ఇచ్చిన అధికారులు, కాంగ్రెస్ నాయకులను చెప్పుతో కొట్టొద్దా?' అని నిలదీశారు.మూసీ బఫర్ జోన్‌లో ఇండ్లు ఉన్నాయంటూ అబద్ధాలు చెప్తూ కూలగొడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, తన సొంత మంత్రులు, తమ పార్టీ ప్రజా ప్రతినిధులకు ఉన్న ఫామ్‌హౌస్‌లు, విల్లాలు, ఇండ్లను ఎందుకు ముట్టుకోవడం లేదని కేటీఆర్ నిలదీశారు. అన్ని అనుమతులతో ఏండ్ల కిందనే కట్టుకున్న ఇండ్లు కూలుస్తున్న ప్రభుత్వానికి, నది నడబొడ్డున నిర్మిస్తున్న బహుళ అంతస్థుల భవనాలు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. పేదలు, మధ్య తరగతి ప్రజల ఇండ్లను కూల్చితే ఎవరూ అడ్డురారని అనుకుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మూసీ బాధితుల పక్షాన కేసీఆర్ సైన్యమైన తాము నిలబడుతామని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డి లాంటి భూ బకాసురుడి నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని పిలుపునిచ్చారు. మూసీ బాధితులకు న్యాయ పోరాటంలోనూ బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



